

భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 26.0
తణుకు : 33.0 - 25.0

చెత్తకు చెక్



చెత్తతో సంపద సృష్టించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పట్టణాల్లో చెత్త సమస్యకు చెక్ పట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రతి మునిసిపాలిటీలోనూ బయోగ్యాస్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని సంకల్పించింది. అందుకోసం 5 ఎకరాల నుంచి 10 ఎకరాల స్థలాన్ని సేకరించాలని సూచించింది. మున్సిపాలిటీలకు సొంత స్థలాలున్నా కేటాయించాలని దిశానిర్దేశం చేసింది. మునిసిపల్ శాఖ డైరెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. కంపోస్ట్ యార్డులు లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న పట్టణాలకు చెత్త సమస్య పరిష్కారం కానుంది. పరిశుభ్రత సాధ్యమవుతోంది. మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరుతుంది. జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లోనూ 300 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఎక్కడ చెత్త వేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. తెల్లవారిందంటే అధికారులకు చెత్త సమస్య వెంటాడుతోంది. డంపింగ్ యార్డులు ఏర్పాటు చేస్తామంటూ ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నారు. ఆచరణలో నెరవేరడం లేదు. స్థలాన్ని సేకరిస్తే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. డంపింగ్ యార్డులు కలగానే మిగిలిపోతున్నాయి.

- పట్టణాల్లో బయోగ్యాస్ ప్లాంట్‌లు
- 5 ఎకరాల భూమి కేటాయించాలంటూ ఆదేశం
- జిల్లాలో తీరనున్న కంపోస్ట్ యార్డు సమస్య
- రెండు మునిసిపాలిటీల్లోనే కంపోస్ట్ యార్డులు
- భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లులో సమస్య తీవ్రం
- బయోగ్యాస్‌తో చెత్త సమస్యకు పరిష్కారం
- ఇతర రాష్ట్రాల్లో విజయవంతం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నరసాపురం, తణుకు పట్టణాల్లోనే కంపోస్ట్ యార్డులున్నాయి. తణుకు పురపాలక సంఘంలో చెత్తతో ఎరువు తయారు చేసే విధానం అమలులో ఉంది. అక్కడ ఆరు ఎకరాల్లో కంపోస్ట్ యార్డుఉంటే దానిని విస్తరించాలని వైసీపీ హయాంలో భూములు సేకరించారు. టీడీఆర్ బాండ్‌లు జారీచేశారు. వైసీపీ ప్రభుత్వంలో స్థలాన్ని సేకరించేందుకు టీడీఆర్ బాండ్‌లు జారీచేసి అభాసుపాలయ్యారు. బాండ్‌ల కోసమే స్థల సేకరణ చేశారు తప్పా కంపోస్ట్ యార్డు విస్తరణ కోసం కాదనేది తేలిపోయింది. మరోవైపు నరసాపురం పట్టణంలోనూ కంపోస్ట్ యార్డు ఉంది. ప్రస్తుతం చెత్త వేయడానికి అక్కడ సమస్య లేదు. అదే భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మునిసిపాలిటీల్లో కంపోస్ట్ యార్డులు లేవు. బయోగ్యాస్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. చెత్తను గుట్టలు మాదిరిగే వేసే దుస్థితిని అధిగమించవచ్చు.

భీమవరంలో కాల్వ గట్లే కంపోస్ట్ యార్డులు

భీమవరంలో యనమదుర్రు గట్టునే కంపోస్ట్ యార్డుగా ఉపయోగించే పరిస్థితి నెలకొంది. డింపింగ్ యార్డు కోసం స్థలాలను సేకరిస్తే రైతులు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. డంపింగ్ యార్డు కల నేరవేరడం లేదు. తాత్కాలికంగానే స్థలాన్ని చూపిస్తున్నారు. గడచిన 20 ఏళ్లుగా భీమవరంలో డింపింగ్ యార్డు కోసం ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. స్థలాన్ని సేకరిస్తే రైతులనుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రాజకీయంగానూ పరోక్షంగా అడ్డుతగులుతున్నారు. దాంతో చెత్త సమస్య భీమవరాన్ని పట్టి పీడిస్తోంది.

తాడేపల్లిగూడెంలో చెరువే డంపింగ్ యార్డు

తాడేపల్లిగూడెం పట్టణంలోనూ చెత్త సమస్యకు పరిష్కారం లభించడం లేదు. మునిసిపాలిటీకి ఇదో పెద్ద సవాలుగా మారింది. గతంలో ఆరుగొలను వద్ద చెత్త వేసేవారు. ఆ తర్వాత విమానాశ్రయ భూముల్లో చెత్తను వేశారు. దానిని కోటి రూపాయలు వెచ్చించి మళ్లీ కుంచనపల్లి వద్దకు చెత్తను తరలించారు. వైసీపీ హయాంలోనే ఇది జరిగింది. అయితే కుంచనపల్లి చెరువులో చెత్త వేయడానికి తాడేపల్లిగూడెం సివిల్ కోర్టు తప్పుపట్టింది. మైక్రో ఇరిగేషన్ చెరువులను కంపోస్ట్ యార్డుగా మార్చివేయడాన్ని ఖండించింది. అక్కడ నుంచి చెత్తను తరలించాలంటూ ఆదేశాలు జారీచేసింది. ఆ విధంగానే మునిసిపాలిటీ అంగీకరించింది. ఇప్పటిదాకా చెత్తను తరలించలేదు. చెరువు మళ్లీ పూడుకుపోయింది. చెత్తను ఎప్పటికప్పుడు తగులబెడుతున్నారు. అటు జాతీయ రహదారి, ఇటు గ్రామాల్లోకి పొగ చుట్టుముడుతోంది. కోర్టు ఆదేశాలను మున్సిపాలిటీ అమలు చేయలేని దుస్థితి నెలకొంది.

పాలకొల్లులో ఖాళీ స్థలాలే డంపింగ్ యార్డులు

పాలకొల్లు పట్టణంలో ఖాళీ స్థలాలను డింపింగ్ యార్డులుగా ఉపయోగిస్తున్నారు. గతంలో వెటర్నరీ ఆసుపత్రి వద్ద పశువుల మేతకోసమని దాతలు ఎకరం స్థలాన్ని సమకూర్చారు. ఇప్పుడు అక్కడే పట్టణంలో చెత్త వేస్తున్నారు. అదే గతంలో అయితే రిజర్వ్‌డ్ స్థలాల్లో వేసే వారు. ప్రస్తుతం నిరర్ధకంగా ఉన్న ఖాళీ స్థలాలను ఉపయోగిస్తున్నారు. ఇలా పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెంలో డంపింగ్ యార్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆకివీడులోనూ అదే దుస్థితి.

బయోగ్యాస్ ఉద్దేశమిదే ..

బయోగ్యాస్ ప్లాంట్‌లలో తడి చెత్తకు పరిష్కారం లభిస్తుంది. తర్వాత చెత్త నుంచి బొగ్గులాంటి పౌడర్ వస్తుంది. దానిని సిమెంట్ పరిశ్రమలు ఉపయోగిస్తుంటాయి. బొగ్గులాంటి పౌడర్ విక్రయం ద్వారా కూడా ఆదాయం వస్తుంది. గతంలో తాడేపల్లిగూడెంలోనే వ్యర్థంతో విద్యుత్ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టారు. తెలుగుదేశం కూటమి హయాంలోనే విమానాశ్రయ భూముల్లో 13 ఎకరాలు కేటాయించారు. ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ప్రహరీని నిర్మించారు. ముంబయ్‌కు చెందిన ఎస్సెల్ కంపెనీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. అక్కడే మున్సిపాలిటీ చెత్తను వేసేది. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల నుంచి చెత్తను తీసుకువచ్చి ప్లాంట్‌కు ఇవ్వాలని అంగీకారం కుదిరింది. కానీ అది కార్యరూపం దాల్చలేదు. కంపెనీ వెనక్కి వెళ్లిపోయింది. అదే స్థలంలో వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలకు స్థలాలను కేటాయించింది. ఇప్పుడు ప్రతి మున్సిపాలిటీలోనూ బయోగ్యాస్ ప్లాంట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక రచించింది. దానికోసం 5 ఎకరాల స్థలం అవసరం కానుంది. ఏ రోజు చెత్త ఆరోజే వినియోగం అయిపోతుంది. బయటకు చెత్త అనేది కనిపించదు. చుట్టు పక్కల ప్రాంతాలకు సమస్య ఉండదు. ఊరుకి కాస్త దూరంగా అయినా సేకరించే అవకాశం ఉంటుంది. దీనివల్ల చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. చెత్త ద్వారా సంపద కూడా వృద్ధి చెందుతుంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా దీనిని అమలు చేస్తున్నారు. మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లోనూ బయోగ్యాస్ ప్లాంట్‌ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లో ప్లాంట్‌లు ఏర్పడితే చెత్త సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది.

అసైన్డ్ భూములపై కొరడా

- క్రమబద్ధీకరణపై దర్యాప్తు
- వైసీపీ హయాంలో సడలింపు
- అడ్డగోలు రిజిస్ట్రేషన్‌లు
- జిల్లాలో వందలాది ఎకరాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో భూకబ్జాలు, అడ్డగోలు రిజిస్ట్రేషన్‌లపై కూటమి ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. దర్యాప్తు చేసేందుకు ఆదేశాలు జారీచేసింది. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో పరిశీలిస్తారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిషేధిత భూములు, అసైన్డ్ ల్యాండ్స్ క్రమబద్ధీకరణకు వెసులుబాటు కల్పించారు. దానిని అడ్డుపెట్టుకుని అధికార పార్టీ నేతలు అడ్డగోలుగా రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారంటూ కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. జిల్లాలో అసైన్డ్ భూములు క్రమబద్ధీ కరణలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయి. అప్పటి అధికారులు వైసీపీ నాయకులకు పూర్తి స్థాయిలో సహకారమందించారు. జిల్లాలో ఉండి నియోజకవర్గంలోనే అత్యధికంగా అసైన్డ్ భూములున్నాయి. వాటిని క్రమబద్ధీకరించే విషయంలో నిబంధనలకు తూట్లు పొడిచారన్న అనుమానాలున్నాయి. అలాగే తీర ప్రాంతంలో చేపల చెరువుల కోసం ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలకు కట్టబెట్టారన్న విమర్శలున్నాయి. వీటన్నింటి పైనా ఇప్పుడు ప్రభుత్వం దృష్టి పెట్టింది. పరిశీలన చేపట్టనుంది. జిల్లా కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించింది. మూడు నెలల వ్యవ ధిలో దర్యాప్తు పూర్తి చేస్తారు. కమిటీ పరిశీలనలో తప్పులు దొర్లాయని తేలితే క్రమబద్ధీకరణను రద్దు చేస్తారు. తదుపరి నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. అప్పటిదాకా సదరు భూమిపై ఎటువంటి రిజిస్ట్రేషన్‌లు చేయడానికి వీలులేదు. మూడో పార్టీకి విక్రయించే అవకాశం లేకుండా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్న తర్వాతే అసైన్డ్ భూములపై మళ్లీ వెసులుబాటు లభిస్తుంది. వాస్తవానికి జిల్లాలో వందలాది ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయి. వైసీపీ హయాంలో క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడంతో పెద్దలు తమకు అనుకూలంగా మలచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వాటి నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అలాగే ప్రభుత్వ భూములు, పోరంబోకు భూములను కబ్జా చేసినా సరే ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ నిషేధిత భూములను పరిశీలించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇప్పటికే రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారు. కొద్ది రోజులుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బంది ఆ పనిలో నిమగ్నమ య్యారు. ప్రభుత్వం ఇప్పుడు అసైన్డ్ భూములు, నిషేధిత భూములపై దృష్టి సారించడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

సచివాలయాలకు రిజిస్ట్రేషన్లు కట్



- కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం
- కొనుగోలుదారులు ఆసక్తి చూపని వైనం
- ఐదేళ్లుగా పడిపోయిన ఆదాయం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లకు కూటమి ప్రభుత్వం నిలుపుదల చేసింది. వైసీపీ హయాంలో సచివాలయాలకు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో దాదాపు 45 సచివాలయాలను ముందుగా ఎంపిక చేశారు. పైలట్ ప్రాజెక్ట్‌లంటూ అప్పట్లో హడావుడి చేశారు. సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అయినా సచివాలయాలను ఎవ్వరూ ఆశ్రయించలేదు. లేఖరులు అందుబాటులో ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటున్నారు. గిఫ్ట్‌డీడ్‌లు అయినా, వివాహ రిజిస్ట్రేషన్‌లు అయినా సరే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపైనే ఆధారపడుతున్నారు. సంశయాలు ఉంటే పరిష్కరించుకోవచ్చని భరోసా కొనుగోలుదారుల్లో ఉంటోంది. లేఖరులే సమస్యకు పరిష్కారం చూపుతుంటారు. భవిష్యత్తులో వివాదాలు లేకుండా దస్తావేజులు రాస్తారన్న నమ్మకం ఉంటోంది. దాంతో సచివాలయాలకు ఎవ్వరూ వెళ్లలేదు. ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించినా ఫలితం లేకపోయింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులే సచివాలయాలకు వెళ్లాలంటూ సూచనలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అంతలా వైసీపీ ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చింది. దీనివల్ల అధికారులు, సిబ్బంది ఆందోళనకు గురయ్యేవారు. కానీ ఫలితం లేకుండా పోయింది. రెండేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం దీనిపై కుస్తీ పట్టింది. సేవలన్నీ సచివాలయాలకు మళ్లించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ యంత్రాంగం ఉండేది. ప్రజలు మాత్రం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్‌లు చేసుకోవడానికి ఆసక్తి చూపారు. సచివాలయాలకు వెళ్లలేదు.

ఆసక్తి చూపని ప్రజలు

సచివాలయాల్లో రికార్డులు భద్రంగా ఉండవన్న అనుమానాలు కూడా జనంలో గూడుకట్టుకు పోయింది. ప్రభుత్వం లక్ష్యం నెరవేరడానికి ఇలా ఎన్నో కారణాలు అవరోధంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లపైనా దృష్టి పెట్టింది. ముందుగా అక్కడ రిజిస్ట్రేషన్‌లు నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయలపై ఒత్తిడి ఉండదు. సచివాలయ పరిధిలో రిజిస్ట్రేషన్‌లు అక్కడే నిర్వహించాలంటూ గతంలో మౌఖిక ఆదేశాలిచ్చారు. ఆ దిశగా సబ్ రిజిస్ట్రార్‌లపై ఒత్తిడి తెచ్చారు, అయినా సరే ప్రజలు సచివాలయాలను నమ్ముకోలేదు. రిజిస్ట్రేషన్ చేయాలంటేనే వెనుకడుగు వేశారు.

ఆశించిన ఫలితం సున్నా

వైసీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖ పెద్దమొత్తంలోనే ఆదాయాన్ని ఆశించింది. భారీ లక్ష్యాలను నిర్దేశించింది. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు నిర్వహించి కొత్త విధానాన్ని తీసుకొచ్చామన్న భావనను జనంలో కలిగించేలా ప్రయత్నాలు చేసింది. ఇవేమీ అక్కరకు రాలేదు. ప్రభుత్వం ఆశించిన ఆదాయం సమకూరలేదు. జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని పొందలేకపోయాయి. రిజిస్ట్రేషన్‌లు తగ్గిపోయాయి. భూములు అమ్ముకుందామంటే కొనుగోలు చేసేవారు కరువయ్యారు. గత ఐదేళ్ల నిర్మాణ రంగం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంది. భీమవరం పట్టణంలో అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం నిలిచిపోయింది. తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాల్లో వైసీపీ నేతల అక్రమ వసూళ్లతో నిర్మాణదారులు బెంబేలెత్తిపోయారు. వైసీపీ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతింది. రిజిస్ట్రేషన్ శాఖపై ఆ ప్రభావం తీవ్రంగా పడింది. రిజిస్ట్రేషన్ ఆదాయానికి భారీగా గండి పడింది. జిల్లాలో 70 శాతం లక్ష్యం చేరుకోవడం కష్టతరమైంది. దాదాపు రూ.350 కోట్లు ఆదాయం రావాల్సి ఉంది. అయితే రూ.250 కోట్లు రావడమే గగనమై పోయింది. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు అంటూ ప్రభుత్వం హడావుడి తప్పా ఆదాయం మాత్రం పెరగలేదు. కేవలం టిడ్కో ఇళ్లు, పేదల ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్‌లకే సచివాలయాలు ఉపయోగపడ్డాయి. అదికూడా రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బంది సహకారం అందించారు. ఒకే రకమైన రిజిస్ట్రేషన్‌లు కావడంతో ఇబ్బందులు పడలేదు. అంతకు మించి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు జరగలేదు. మరోవైపు ఆదాయం కూడా పడిపోయింది. ఇప్పటికీ రియల్ ఎస్టేట్ రంగం కోలుకోలేదు. నిర్మాణ రంగం ఊపందు కోలేదు. భవిష్యత్తులో బాగుంటుందని అంతా ఆశిస్తున్నారు. ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు. నిర్మాణ దారులు కూడా కొత్త ప్రాజెక్ట్‌లకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు,

---

టీచర్లు లేకుండా.. సన్మార్గంలో పెట్టేదెలా?

- ఏలూరు ప్రభుత్వ వసతి గృహంలో నిరాదరణ బాలలు 66 మంది
- చట్టంతో విభేదించిన బాలలు ఐదుగురు
- చదువు చెప్పేందుకు ఉపాధ్యాయులే లేరు
- నియామకం పట్టని విద్యాశాఖాధికారులు
- ప్రమాదంలో విద్యార్థుల భవిష్యత్



శనివారపుపేట ప్రభుత్వ బాలుర గృహం

ఏలూరు క్రైం, ఆగస్టు 10 : నేటి బాలలు రేపటి పౌరులని వారిని సన్మార్గంలో పెడితే భవిష్యత్ సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఎలాంటి సంఘ వ్యతిరేక శక్తులు ఉండవని విజ్ఞావంతుల సూచనలతో ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వాలు అమలు చేస్తూనే ఉన్నాయి. కానీ క్షేత్రస్థాయికి వచ్చేసరికి వాటిని సరిగ్గా అధికారులు పట్టించుకోక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇందుకు ఉదాహరణగా ఏలూరు లోని ప్రభుత్వ బాలుర వసతి గృహం (జువైనల్ హోమ్) నిలుస్తోంది.

ఉమ్మడి పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాలకు సంబంధించిన అనాథ బాలలు, చట్టంతో విభేదించే బాలలను సన్మార్గంలో తీర్చిదిద్దడానికి ఏలూరులోని ప్రభుత్వ వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. చట్టంతో విభేదించే బాలల్లో పూర్తిగా మార్పు తీసుకురావడానికి ఈ వసతి గృహంలోనే జువైనల్ హోమ్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా పలు సంస్కరణ చర్యలకు శ్రీకారం చుట్టారు. గతంలో ఇక్కడ పిల్లలను శనివారపుపేటలోని హైస్కూలు, ప్రాథమిక పాఠశాలకు చదువుకునేందుకు పంపించే వారు. అలా వెళ్తున్నవారు తరచుగా అదృశ్యం కావడంతో ప్రభుత్వం ప్రత్యేకంగా కొన్నేళ్ల క్రితం ప్రాథమిక స్కూలుకు అనుమతి ఇచ్చి ప్రతి సంవత్సరం అప్ గ్రేడ్ చేసి పదో తరగతి వరకూ రికగ్నైజేషన్ చేశారు. ఏటా డిప్యూటేషన్‌పై నియమించిన టీచర్లతో పాటు విద్యా వలంటీర్లు చదువు చెప్పేవారు. అనాథలు, తల్లిదండ్రుల ఆదరణ లేని పిల్లలు అక్కడే చదువుకుంటూ పరీక్షలు రాసి ఆ తర్వాత ఉన్నత చదువులకు పంపించేవారు. 18 ఏళ్లు దాటిన తర్వాత వారి కాళ్ళపై వారు జీవించేందుకు చేతి వృత్తులు నేర్పించి ఆపై రుణం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేది. ఇలా కష్టపడే తత్వాన్ని అలవాటు చేసేవారు. ఈ విధంగా కొన్నేళ్ల పాటు సాగినా గతేడాది ఉపాధ్యాయులను తిరిగి నియమించలేదు. ఈ క్రమంలోనే ఏడాది క్రితం హైకోర్టు న్యాయమూర్తులు ఆ వసతి గృహాన్ని ఆకస్మికంగా పరిశీలించి పిల్లలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు లేరని తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వారు చెప్పడంతో హైకోర్టు ఆదేశాల మేరకు డీఈవో ఆ పాఠశాలకు వివిధ సబ్జెక్టులకు సంబంధించి ఆరుగురు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించారు. చట్టంతో విభేదించిన బాలలను సంస్కరణ చేయడానికి అర్హత కలిగిన స్పెషలైజేషన్ టీచర్‌ను నియమించారు. గతేడాది పదో తరగతి పరీక్షకు ఇద్దరు హాజరు కాగా, ఒకరు ఉత్తీర్ణత సాధించారు. మరొకరు కొన్ని సబ్జెక్టుల్లో మాత్రమే ఫెయిల్ అయ్యాడు. అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఈ ఏడాది ఏప్రిల్ 23 రిలీవ్ చేయడంతో తిరిగి వారి సొంత పాఠశాలలకు వెళ్లిపోయారు.

ఎన్ని లేఖలు రాసినా..

2024- 2025 విద్యా సంవత్సరం ఈ ఏడాది జూన్ 12న ప్రారంభమైంది. విద్యాశాఖాధికారులు మాత్రం ఇప్పటి వరకూ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించలేదు. వసతి గృహం సూపరింటెండెంట్ విద్యా శాఖకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించాలని కోరుతూ ఎన్ని లేఖలు రాసినా డీఈవో కార్యాలయంలో స్పందన కరువైంది. ఇటీవల జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ ఆ వసతి గృహాన్ని సందర్శించి బాలల నుంచి సమస్యలను తెలుసుకోగా తమకు ఉపాధ్యాయులు లేరని ఇప్పటి వరకు తమకు ఎలాంటి చదువులేదని చెప్పడంతో ఆయన కూడా సంబంధిత అధికారులకు లేఖ రాశారు. అయినా ఇప్పటి వరకు జిల్లా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ప్రస్తుతం ఆ పాఠశాలలో అనాథలు, తల్లి దండ్రుల ఆదరణ కోల్పోయిన వారు 66 మంది ఉన్నారు. చట్టంతో విభేదించిన బాలలు మరో ఐదుగురు ఉన్నారు. ఇక్కడ ఉన్న బాలలు అందరినీ విద్యా బుద్ధులతో క్రమ శిక్షణతో అహర్నిశలు కష్టపడి తీర్చిదిద్దితే వారు ఉత్తమ పౌరులుగా సమాజంలో జీవించే అవకాశాలు ఉన్నాయి. కానీ ఉపాధ్యాయులు లేకుండా కేవలం వారిని గదుల్లో పెట్టి బంధించి ఉంచితే భవిష్యత్తులో అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదం ఉంది. కేవలం అధికారుల నిర్లక్ష్యంతోనే ఇక్కడ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిపోతోందని విజ్ఞులు చెబుతున్నారు.

నిధుల కొరత ఉన్నా..అభివృద్ధి, సంక్షేమం కొనసాగిస్తాం

మంత్రి రామానాయుడు



ఫుట్‌పాత్ బ్రిడ్జిని ప్రారంభించి నడిచి వెళుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

యలమంచిలి, ఆగస్టు 10: రాష్ట్రంలో నిధుల కొరత ఉన్నా అభివృద్ధి, ప్రజాసంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. గంగడపాలెంలో ప్రాథమిక పాఠశాల వద్ద కాలువపై రూ.12లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మించిన ఫుట్‌పాత్ బ్రిడ్జిని మంత్రి ప్రారంభించారు. అనంతరం గంగడపాలెం, మట్లపాలెం, నార్నిమెరక, వడ్డిలంక గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణపనులు, మట్లపాలెం ఉన్నతపాఠశాలలో మీటింగ్‌హాలు నిర్మాణపనులకు మంత్రి రామానాయుడు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ప్రజలు జగన్ రాక్షసపాలనను తరిమికొట్టి.. ప్రజాప్రభుత్వం ఎన్డీఏను ఆశీర్వదించారన్నారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి జాడ కానరాలేదని.. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలో అన్న క్యాంటీన్‌లను తెరుస్తున్నామని తెలిపారు. సభలు, సమావేశాలకు వచ్చినపుడు భారీ దండలు, బొకేలు, పూలదండలు వేయవద్దని, వాటిస్థానంలో కూరగాయలు, నిత్యావసర సరుకులు ఇస్తే వాటిని నిరుపేదలకు అందిస్తే వారికి ఒకరోజు భోజనం సమకూరుతుందని మంత్రి కోరారు.

భూ సమస్యలకు పరిష్కారం

ఈనెల 16 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భూసమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తోంది. అందుకోసం ప్రణాళికలు సిద్ధం చేసింది. భూసమస్యలపై రైతుల నుంచి, భూయజమానుల నుంచి వినతులు స్వీకరించనుంది. చుక్కల భూముల విషయంలోనూ వినతులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. ఆగస్టు 16వ తేదీ నుంచి సదస్సులు నిర్వహిస్తారు. అంతకు తొలిరోజు ముందుగానే జిల్లా మంత్రి రామారానాయుడు, ఎమ్మెల్యేలు లాంఛనంగా సదస్సును ప్రారంభిస్తారు. జాయింట్ కలెక్టర్ సదస్సులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్‌లతో కూడిన అధికారులు, సిబ్బంది కమిటీలో ఉంటారు. ప్రతి రెవెన్యూ గ్రామంలోనూ కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తుంది. వినతులు స్వీకరిస్తుంది. పరిష్కారం చూపుతుంది. రెవెన్యూ సదస్సులపై ముందుగానే గ్రామాల వారీగా షెడ్యూల్ నిర్ణయిస్తారు. ఆ మేరకు సమావేశాలు ఏర్పాటు చేస్తారు. రెవెన్యూ సదస్సుల ద్వారా రీ సర్వే సమస్యలు కూడా పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి ఆస్తులకు ఎల్‌పీఎం నంబర్ జారీలో ఇబ్బందులున్నాయి. సదరు భూములకు మార్కెట్ విలువను నిర్ధారించలేదు. దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందలేకపోతున్నారు. మరోవైపు అడంగల్‌లోనూ పేరు నమోదు చేయని భూములు కూడా ఉన్నాయి. ఇవన్నీ రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారానికి నోచుకోనున్నాయి.



4వ వర్ధంతి

మాకు ప్రేమానురాగాలు పంచి
మా బంగారు భవిష్యత్‌కు
అహర్నిశలు శ్రమించి మాకు
బంగారు బాటలు వేసిన
మీ ఋణం ఎలా తీర్చుకోగలం
మీరు మా నుండి దూరమైనా
మీ మధుర జ్ఞాపకాలు మరువలేము
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

కీ.శే. కనపర్తి శ్రీనివాస్
(ఆల్ రౌండర్) పూలపల్లి
జననం: 29.11.1970 మరణం: 11.08.2020

భార్య: సత్యదేవి

తండ్రి - తల్లి : కనపర్తి సూరయ్య - వెంకటనర్సమ్మ
కుమారుడు,కుమార్తె : సోమసాయి సురేష్, జాస్మిని
తమ్ముడు : కనపర్తి నరసింహస్వామి (చిన్న) - సుధారాణి (లేటు)
పెద్ద బావ గారు : గంటి శ్రీనివాస్,(లేటు) భీమవరం
అక్క : కనక పయ్యారమ్మ
చిన బావ గారు : దువ్వాపు విష్ణుశ్వేరరావు, తాడేపల్లిగూడెం
చెల్లి : అన్నవరం ధనలక్ష్మి
మేనల్లుళ్ళు : గంటి యశోనారాయణ, భీమవరం
గంటి నాగేంద్ర, దువ్వాపు సాయి ప్రకాష్,
దువ్వాపు శ్యామ్ ఆంజనేయులు
మేనకోడలు : చాముండేశ్వరి (చిన్నారి)
తమ్ముడు కుమార్తెలు : జ్ఞాన స్వాతికా, గీతా నమ్రత
తోడల్లుడు : గుండేపల్లి గణేష్‌రాము, ఉండ్రాజవరం
వదిన గారు : గుండేపల్లి నాగమణి
చిన్న వదిన గారు : టేకు డాక్టర్ కుమారి
అత్తయ్య గారు : ఇల్లూరి మంగతాయారు, పందాలపాక



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు బ్యాంకు రుణాలకు వెళ్లవద్దు

మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు టౌన్, ఆగస్టు, 10 :పాలకొల్లులో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు కొత్తగా బ్యాంకు రుణాలకు వెళ్లవద్దని ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం తగదని ప్రజలకు ఇబ్బంది లేకుండా విధులు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ టిడ్కో గృహాలకు సంబంధించి టీడీపీ ప్రభుత్వం హయాంలో 90 శాతం నిర్మాణాలు పూర్తయితే గత వైసీపీ ప్రభుత్వంలో రూపాయి పని కడాఅ చేపట్టలేదని విమర్శించారు. బ్యాంకులో తాకట్టు పెట్టి లబ్ధిదారులను రుణగ్రస్తులను చేయడంతో పాటు ఆ సొమ్ములను జగన్ ప్రభుత్వం మళ్లించుకుందన్నారు. బ్యాంకు రుణాలు పొందని లబ్ధిదారులు 500 మంది ఉన్నారని వారంతా బ్యాంకుల్లో రుణాలు తీసుకోనవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. మిగిలిన 10 శాతం పనులు పూర్తిచేసి కాలనీలో మౌళిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారధి, డిఈ. రాజకుమార్, టీపీవో కె.వీరబ్రహ్మం, ఆర్వో ఎ.శ్రీనివాసరాజు, ఏఈలు సాంబశివుడు, జి.సతీష్, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కబర్ధి, బోనం చినబాబు, గండేటి వెంకటేశ్వరరావు, జక్కంపూడి కుమార్, కర్నేన గౌరునాయుడు పాల్గొన్నారు.



ఉండి మండలం వాండ్రంలో ఆంధ్రప్రదేశ్ ఫిష్ ట్రేడర్స్ అండ్ ప్యాకర్స్ అసోసియేషన్ నూతన భవనం ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మంతెన రామరాజు తదితరులు

ఆక్వా అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ఉండి ఆగస్టు 10: ఆక్వారంగ అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంసిద్ధంగా వున్నాయని ఆక్వా రైతుల సంక్షేమమే ప్రభుత్వాలు ధ్యేయమని కేంద్ర ఉక్కుగనుల, భారీ పరిశ్రమల సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం ఉండి మండలం వాండ్రం రైల్వేగేటు అవతల ఆంధ్రప్రదేశ్ ఫిష్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన నూతన భవనాన్ని కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ ప్రారంభించారు.ఉండి, ఉంగుటూరు ఎమ్మెల్యేలు రఘురామకృష్ణరాజు, పట్నుమట్ల ధర్మరాజులు మాట్లాడుతూ ఆక్వారైతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక కార్యచరణతో వున్నారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, కైకలూరు, భీమవరం ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పులపర్తి రామాంజేయులు మాట్లాడుతూ ఆక్వా రంగం వల్లే భీమవరానికి దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. ఆక్వా రైతులకు నాణ్యమైన ఫీడ్, సీడ్ అందించి మేత ధరలు తగ్గించేందుకు సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. జోన్‌తో సంబంధం లేకుండా విద్యుత్ సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. భవన నిర్మాణానికి సహకరించిన దాతలను సన్మానించారు. ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్సులు ఉద్దరాజు కృష్ణప్రసాద్, మహమ్మద్ మదనీ, పద్మనాభరాజు, గాదిరాజు సుబ్బరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, వాండ్రం సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, ఆక్వారైతులు పాల్గొన్నారు.

రేపు రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము : పితాని

పెనుమంట్ర, ఆగస్టు 10 : దాళ్వా ధాన్యం సొమ్ము రాష్ట్ర ప్రభుత్వం రూ.660 కోట్లు బకాయి పడిందని ఇది సోమవారం రైతుల ఖాతాల్లో జమ చేస్తారని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చెప్పారు. రైతు సంఘం నాయకులు ధాన్యం సొమ్ము జమ కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన వెంటనే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో ఫోన్లో మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు రూ.200 కోట్లు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రూ.300 కోట్లు వివిధ జిల్లాలకు రూ.165 కోట్లు ధాన్యం సొమ్ము సోమవారం బ్యాంకు ఖాతాలో జమవు తుందని చెప్పారు.

అందుబాటులో ఇసుక

భీమవరం టౌన్, ఆగస్టు 10 : జిల్లాలో ఇసుక రీచ్‌లు అందుబాటులో లేని కారణంగా పొరుగు జిల్లాలనుంచి ఇసుకను లబ్ధిదారులు అవసరం మేరకు పొందవచ్చునని కలెక్టర్ నాగరాణి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులు మర్రులో 12,545 మెట్రిక్ టన్నులు, పెండ్యాల - 1,19,150 మెట్రిక్ టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రు- 42,208 మెట్రిక్ టన్నులు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు-1లో 3,789 మెట్రిక్ టన్నులు, రావులపాడు-2లో 1,700 మెట్రిక్ టన్నులు ఇసుక శనివారం నాటికి అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఆహో..!

ఆటపాక పక్షుల కేంద్రానికి కొత్త అందాలు

రూ.20 లక్షల వ్యయంతో వసతుల ఏర్పాటు

పక్షుల కోసం 60 కృత్రిమ ఐరన్ స్టాండ్లు.. వీఐపీలకు గెస్ట్‌హౌస్

కైకలూరు, ఆగస్టు 10: సహజ సిద్ధంగా ఏర్పడిన కొల్లేరు సరస్సు విదేశీ పక్షులకు ఆలవాలం. నిత్యం పర్యాటకంతో సందడిగా ఉంటుంది. గత ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకోకపోవడంతో ఉన్న వసతులు కూడా తుప్పుపట్టి పోయాయి. ఏలూరు జిల్లాలో 77,136 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సులో ఆటపాక పక్షుల కేంద్రం పర్యాటకంగా పేరొందింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పక్షుల కేంద్రానికి రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనుల చేపట్టారు. పక్షుల ఆవాస కేంద్రాలను ఏర్పాటు, పర్యాటకులు సేద తీరేందుకు సిమెంటు బల్లలు, బోట్లు మరమ్మతులు వంటివి చేపట్టారు. వీఐపీలు వచ్చిన సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లను నిర్వహించారు. విదేశీ పక్షులు ఆవాస కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు 60 కృత్రిమ ఐరన్ స్టాండ్లు, 30 సిమెంటు బల్లలను ఏర్పాటు చేశారు. లైఫ్ జాకెట్‌లను కొనుగోలు చేశారు. పర్యాటకులకు ప్రైవేటు గెస్ట్‌హౌస్ ఏర్పాటు చేశారు. గతంలో కృత్రిమ ఐరన్ స్టాండ్లు లేకపోవడంతో పక్షుల ఆవాస కేంద్రాలకు చోటు లేకపోవడంతో వేరే ప్రాంతా లకు వెళ్లిపోయేవి. కొత్తగా స్టాండ్లు ఏర్పాటు చేయడంతో మరిన్ని పక్షులు కొల్లేరు సరస్సుకు వస్తాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈడీసీ కేంద్రం వద్ద ప్రహారీగోడలపై పక్షుల చిత్రపటాలు పిల్లలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బోటు షికారుతో పాటు పక్షుల నమూనాలను తెలిపే విధంగా పెయింటింగులు ఏర్పాటు చేశారు.



పక్షుల ఆవాసానికి కొత్తగా ఏర్పాటు చేసిన ఇనుప స్టాండ్లు



పక్షుల కేంద్రంలో గోడలపై ఆకట్టుకుంటున్న పెయింటింగ్‌లు





చిల్డ్రన్స్ పార్క్‌లో కొలువుదీరిన ఆట పరికరాలు



పక్షుల కేంద్రంలో కనువిందు చేస్తున్న విదేశీ పక్షులు



కొత్తగా వచ్చిన విద్యార్థులకు అడ్మిషన్లు అందజేస్తున్న అధికారులు

నిట్‌లో బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థుల ప్రవేశం

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 10 : ఏపీ నిట్‌లో బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులు వస్తున్నారు. దీంతో ప్రాంగణం మొత్తం సందడిగా మారింది. బీటెక్‌లో మొత్తం 480 సీట్లు ఉన్నాయని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్‌శంకర్‌రెడ్డి తెలిపారు. వీటిలో 50 శాతం సీట్లు రాష్ట్ర విద్యార్థులతోనూ , మిగిలిన వాటిని ఇతర రాష్ట్రాల విద్యార్థులతోనూ జోసా, సీ-సాబ్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నామన్నారు. కౌన్సిలింగ్‌లో మొత్తం 480 సీట్లకు అలాట్‌మెంట్ పూర్తి అయ్యిందన్నారు. సీటు అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు తమ కుటుంబసభ్యులతో నిట్‌కు వచ్చి ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవడంతో పాటు ఫీజులు చెల్లించి ప్రవేశాలు పొందుతున్నారన్నారు. నిట్ ఇన్‌చార్జి డైరక్టర్ ఆధ్వర్యంలో ఈ ప్రవేశాలు జరగగా, సెంటర్ ఇన్‌చార్జిగా డీన్ అకడమిక్ డాక్టర్ టీ.కురుమయ్య, సెంటర్ ఇన్‌చార్జులుగా డాక్టర్ తపస్ పరమానిక్, డాక్టర్ రాముడు వ్యవహరించారు. తొలిరోజు 54 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు.

ట్రిపుల్ ఐటీలో 309 సీట్లు ఖాళీ

నూజివీడు టౌన్, ఆగస్టు 10: ఆర్జీయుకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మొదటి, రెండు విడతల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తికాగా 309 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. మొత్తం నాలుగు క్యాంపస్‌లకు గాను 4 వేల ట్రిపుల్ ఐటీ సీట్లకు మరో 400లు సూపర్ న్యూమరీ సీట్లు కలిపి 4,400 సీట్లకు ఆర్జీయూకేటీ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించింది. నాలుగు క్యాంపస్‌ల మీద 753 సీట్లు మిగలగా రెండో విడత కౌన్సెలింగ్‌లో 444 సీట్లు భర్తీ అయ్యి 309 సీట్లు మిగిలాయి. వీటికి త్వరలో మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, ఆగస్టు 10 : స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని దక్షిణ మధ్య రైల్వే పది ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ రైళ్లను నడుపుతున్నట్లుగా రైల్వే అధికారులు తెలిపారు.

07653 కాచిగూడ - తిరుపతి ఈనెల 14 నుంచి 16 వరకూ
07654 తిరుపతి - కాచిగూడ ఈనెల 15 నుంచి 17 వరకూ
07453 మచిలీపట్టణం - వికారాబాద్ ఈనెల 13 నుంచి 15 వరకూ
07454 వికారాబాద్ - మచిలీపట్టణం ఈనెల 14 నుంచి 16 వరకూ
07069 హైదరాబాద్ - సత్రగంజి ఈనెల 14వ తేదీ
07070 సత్రగంజి - హైదరాబాద్ ఈనెల 15వ తేదీ
07698 నర్సపూర్ - నాగర్‌సోల్ ఈనెల 13వ తేదీ
07699 నాగర్‌సోల్ - నర్సాపూర్ ఈనెల 14వ తేదీ
07517 నర్సపూర్ - సికింద్రాబాద్ ఈనెల 15వ తేదీ
07518సికింద్రాబాద్ -నర్సపూర్ ఈనెల 16న రైళ్లను నడుపుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు



విలేకరుల సమావేశంలో మట్లాడుతున్న మోషేన్‌రాజు

భీమవరంటౌన్, ఆగస్టు 10 : విజయవాడలో నిర్మించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహ సముదాయంలోకి కొంత మంది వ్యక్తులు ప్రవేశించి విగ్రహ ధ్వంసానికి ప్రయత్నించి శిలాఫలకం తొలగించడం బాధాకరమని, వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకో వాలని ఏపీ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోనే అత్యున్నత ఆదరణ కలిగిన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించడం రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చడమేనన్నారు. దేశ నాయ కులు, రాజకీయనాయకుల విగ్రహాలకు రక్షణ కల్పించాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ స్మృతి వనం జోలికి వెళ్లడం అంటే రాజ్యాంగంపై దాడిగా భావించాన్నారు.



ఉచిత దర్శనం క్యూలైన్ దాటి బయట బారులు తీరిన భక్తులు

చిన వెంకన్న క్షేత్రానికి భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, ఆగస్టు 10: గోవింద నామాలతో చినవెంకన్న క్షేత్రంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడం అందులోనా రెండో శనివారం అవడం వల్ల క్షేత్రానికి విశేషసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది.దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు యాత్రికులతో నిండిపోయాయి. స్వామివారి ఉచిత దర్శనానికి దాదాపు రెండుగంటల పైబడి సమయం పట్టింది. సుమారు 20 వేల మంది వరకూ భక్తులు వచ్చినట్లు ఆలయ అధికారుల అంచనా.దర్శనం అనంతరం భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

రూ. 3 కోట్ల విలువైన ఆలయ స్థలం స్వాధీనం

భీమవరం టౌన్, ఆగస్టు 10 : పట్టణంలోని భీమేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన భూమి 13 సెంట్లను శనివారం హైకోర్టు ఉత్తర్వుల మేరకు దేవదాయ జిల్లా అధికారి ఈదుల వెంకట సుబ్బారావు పర్యవేక్షణలో స్వాధీనం చేసున్నట్టు ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ స్థలం విలువ 3 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ఆలయానికి ఉత్తరం వైపు ఉన్న భూమిపై అర్చక సర్వీసు వంతుదారుడైన కొత్తలంక శ్రీనివాసరావు హైకోర్టులో పిటిషన్ వేసిన నేపథ్యంలో వాదనలు విన్న తరువాత హైకోర్టు సంబంధిత పిటిషన్‌ను డిస్మిస్ చేసిందని దాంతో స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు స్థలం ఆక్రమణకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.



కేంద్ర మంత్రులకు ఎంపీ మహేష్ వినతి

ఏలూరు రూరల్, ఆగస్టు 10: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి కేంద్రమంత్రులు ప్రహ్లాద్ జోషి, హరిదీప్‌సింగ్ పూరీలను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కలిశారు. రాష్ట్రానికి పప్పుధాన్యాలు ఎక్కువగా కేటాయించాలని, రాష్ట్రంలో కొత్తగా 8 ధరల నివేదన కేంద్రాల ఏర్పాటుకు ధరల స్థిరీకరణ నిధి రూ.532 కోట్లు కేటాయించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలోని హర్యానా భవన్‌లో ఆ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను ఎంపీలు మహేష్‌కుమార్ ఎం.భరత్, మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఉదయ్ శ్రీనివాస్, కృష్ణప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు.

13న పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం



కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, ఆగస్టు 10: సొంతంగా ఆధునిక యంత్రాలు సమకూర్చుకోలేని సందర్భంలో సారూప్య పరిశ్రమలు ప్రత్యేక ప్రయోజన సమాఖ్యగా (ఎస్‌పివి) ఏర్పడి క్లస్టర్ డెవలప్మెంట్ పథకంలో యంత్రాలు సమకూర్చుకోవడానికి అవకాశం ఉందని యాజమాన్యాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. దీనిపై అవగాహన కలిగించేందుకు పరిశ్రమల ప్రతినిధులతో ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఒకే రకమైన కార్యకలాపాలు నిర్వహిస్తూ దగ్గర దగ్గరగా సుమారు 10, 15 పరిశ్రమలు వున్న చోట అందరికీ ఉపయోగపడేలా క్లస్టర్ డెవలప్మెంట్ ద్వారా కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుతో ప్రయోజనం పొందవచ్చన్నారు ఐదు నుంచి పది కోట్ల వరకు ప్రాజెక్టు విలువ కలిగిన పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వ గ్రాంటు 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటు 20 శాతం, పరిశ్రమల యాజమాన్యం వాటా 10 శాతం, అలాగే 10 నుంచి రూ. 30 కోట్లు విలువ కలిగిన పరిశ్రమలకు కేంద్ర గ్రాంటు 60 శాతం, రాష్ట్ర గ్రాంటు 20 శాతం యాజమాన్యం వాటా 20 శాతంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. ఇతర సమాచారం కోసం జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మంగపతిరావును99592 56522 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

భీమవరం టౌన్, ఆగస్టు 10 : భీమవరం పట్టణంలోని 11వ వార్డు వార్డు సచివాలయంలో ఎడ్యుకేషన్ డేటా ప్రోసెసింగ్ సెక్రటరీగా పనిచేస్తున్న రాఘవను సస్పెండ్ చేసినట్లు మునిసిపల్ కమిషనర్ శ్యామల తెలిపారు. ఈనెల 1వ తేదీన పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహించి జాప్యానికి కారణమైనందున ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

విస్తృతంగా వాహన తనిఖీలు

ఏలూరు క్రైం, ఆగస్టు 10 : అక్రమ రవాణాదారుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తేలా ఏలూరు జిల్లా వ్యాప్తంగా పోలీస్ మార్క్‌ను శనివారం సాయంత్రం చూపించారు. జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాలతో జిల్లాలోని డీఎస్పీల నుంచి హోంగార్డు వరకూ అందరూ శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకూ అన్ని ప్రాంతాల్లోనూ ఏకకాలంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, మత్తుపదార్థాలు, సారా, అక్రమ ఇసుక, ఇతర ప్రాంతాల మద్యం రవాణా కాకుండా ఈ తనిఖీలు నిర్వహించారు. అతి వేగంగా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులను, శబ్ద కాలుష్యాన్ని సృష్టించే ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను కలిగి ఉన్న వాహనాలను వెంటనే గుర్తించి ఆ సైలెన్సర్లను తొలగించారు. హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సు ఇన్సూరెన్సు, వాహనాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. రికార్డులలు సక్రమంగా లేని వాహనాలను స్టేషన్లకు తరలించారు.

డెంగీతో ప్రభుత్వాసుపత్రి ఉద్యోగి మృతి



ఏలూరు క్రైం, ఆగస్టు 10 : ఏలూరు పత్తేబాదకు చెందిన దాండే శాంతకుమారి (54) డెంగీ జ్వరంతో మృతి చెందారు. శాంతకుమారి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని ట్రామాకేర్ విభాగంలో అవుట్ సోర్సింగ్ ఎఫ్ఎన్‌వోగా పనిచేస్తున్నారు. రెండు రోజుల నుంచి ఆమె జ్వరంతో బాధపడుతూ ఈనెల 9వ తేదీన ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. సాయంత్రానికి ఆమె పరిస్థితి మరింత విషమించడంతో వెంటనే నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించగా ఆమెకు డెంగీ పాజిటివ్ అని వెల్లడైంది. దీంతో అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆసుపత్రి ఉద్యోగులు తీవ్ర విషాదానికి గురయ్యారు. శాంతకుమారికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు చెబుతున్నారు.

ఆక్వా హబ్‌ను పరిశీలించిన ఎఫ్ఏవో టీం

కలిదిండి, ఆగస్టు 10 : కలిదిండిలో శనివారం ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్‌టీం ఆక్వా హబ్‌ను సందర్శించింది. రైతుల నుంచి చేపలు కొనుగోలు చేసి వాటిని ఏ విధంగా ప్రాసెసింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోగేశ్వరం లంకలో 5 ఎకరాల రొయ్యల చెరువును పరిశీలించారు. రొయ్యల సాగు విధానాన్ని ఆక్వా రైతును అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.


క్రైం కార్నర్

చెట్టును ఢీకొట్టిన ఆటో

ఐదుగురికి గాయాలు




ప్రమాదంలో గాయపడినవారు



పెదవేగి, ఆగస్టు 10 : ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రహదారి పక్కన చెట్టును ఢీకొట్టి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు గాయాలతో ఆస్పత్రి పాలైనట్టు పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఏలూరు నుంచి చింతలపూడి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో పెదవేగి మండలం రామచంద్రపురం అడ్డరోడ్డు దాటిన తరువాత వేరొక వాహనాన్ని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనదారుడు ఆటో వైపు వేగంగా రావడంతో ఆటోను రహదారి మార్జిన్‌లోకి దించాడు. మార్జిన్ మొత్తం బురదతో ఉండడంతో ఆటో అదుపు తప్పి సమీపంలో ఉన్న చెట్టు మోడును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చింతలపూడి మండలం దేశవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కాపుదాసి రవికుమార్, డ్రైవర్ పక్కనే ఉన్న దేశవరం గ్రామానికే చెందిన కాపుదాసి భాస్కరరావులు తీవ్రంగా గాయపడ్డారు. లింగపాలెం మండలం సుందరావుపేటకు చెందిన కాట్రు మరియమ్మ, ముసునూరు మండలం వేల్పుచర్లకు చెందిన తాళ్లూరి కాంతమ్మ, బండి శైలజలు గాయపడ్డారు.సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

మత్తిచ్చి మేకలను ఎత్తుకుపోదామనుకున్నారు..

పట్టుకుని పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు



సచివాలయంలో బంధించిన అనుమానితులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 10: మేకలకు మత్తిచ్చి ఎత్తుకుపోదామని వచ్చిన దొంగలను గ్రామస్థులు పోలీసులకు పట్టించిన ఘటన తాడేపల్లిగూడెం మండలంలోని కడియద్దలో శనివారం చోటు చేసుకుంది. కడియద్దలో మేకలు మేపే కాలనీలో ఐదుగురు వ్యక్తులు మేకలకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి మేకలను వ్యాన్‌లో తర లించేందుకు సిద్ధమయ్యారు. స్థానికులు గుర్తించి వారిని వెంబడించి పట్టుకు న్నారు. వెంటనే వారిని గ్రామ సచివాలయానికి తరలించి దేహశుద్ధి చేశారు. వారిలో ఒకరు నూజివీడుకు చెందిన వంట మాస్టారు కాగా మరో నలుగురు అదే ప్రాంతానికి చెందినవారిగా గుర్తిం చారు. ఈ ప్రాంతంలో మేకలు ఉన్న సమాచారం తెలుసుకుని చోరీకి యత్నించినట్టు గుర్తించారు. వీరిని రూరల్ పోలీసులకు అప్పగించారు. దీనిపై రూరల్ ఏఎస్సై గోపీనాథ్‌ను వివరణ కోరగా అనుమానితులను స్టేషన్‌కు తీసుకువచ్చామని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 10 : వివాహిత అయిన తన కుమార్తె కనబడటం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. తన కుమార్తెకు భర్తతో కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 1న పంగిడిగూడెంలోని తన తల్లి ఇంటికి వచ్చింది. ఈనెల 8వ తేదీన కుమార్తె ఇంటి దగ్గర కనబడ లేదు. చుట్టుపక్కల చూసినా ఫలితం లేకపోయేసరికి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. పంగిడిగూడెం గ్రామానికి చెందిన తంగెళ్లరెడ్డి అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఏఎస్సై తెలిపారు.

యువకునిపై ఫోక్సో కేసు

ఏలూరు క్రైం, ఆగస్టు 10 : ఇంటర్మీడియట్ చదివే ఒక యువతికి మాయ మాటలు చెప్పి మోటారు సైకిల్‌పై తీసుకువెళ్ళిన యువకునిపై ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కృష్ణా జిల్లాకు చెందిన ఒక యువతి (16) ఏలూరులో ఒక కళాశాలలో ఇంటర్మీడియట్ చదువు తుంది. రోజూ బస్సులో వెళ్ళి వస్తుంది. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం రేపమల్లికి చెందిన మాలవతు శ్రీరామ్‌నాయక్ (21) అనే యువకుడు ఆ యువతిని రోజూ వేదింపులకు గురిచేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈనెల 8వ తేదీన కాలేజీకి వెళ్ళిన ఆ యువతిని బెదిరించి తన మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని నూజివీడువైపు వెళ్తుండగా బంధువులు చూసి ఆ యువతి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయువతిని తీసుకువచ్చి జరిగిన విషయం తెలుసుకుని ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీరామ్‌నాయక్‌పై ఫోక్సో కేసు నమోదు చేశారు. యువతిని వేధించి, బెదిరించి కిడ్నాప్ చేశారని కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని ఒకనికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, ఆగస్టు 10 : మోటారు సైకిల్‌పై వెళ్తున్న దంపతులను అతి వేగంగా ఎదురుగా వచ్చిన బిఎండబ్ల్యు కారు ఢీకొనడంతో ఒకనికి కాలు విరిగిపోయింది. ఏలూరులోని కత్తేపువీధినకు చెందిన షేక్ మౌలాలీ, అతని భార్య షేక్ మెహర్రాజ్ కలిసి బుల్లెట్‌పై ఏలూరు మినీ బైపాస్ రోడ్డులోని ఒక దాబాకు వెళ్ళి టిఫిన్ చేశారు. తిరిగి ఇంటికి వెళ్ళే నిమిత్తం మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో రామకృష్ణాపురం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి వద్ద ఎదురుగా వస్తున్న కారు అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో మౌలాలి కాలు విరిగింది. మెహర్రాజ్ గాయాలపాలైంది. ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

PLOT FOR SALE
విజయవాడ-బందర్‌రోడ్డు ORRకు సమీపంలో LP.no, బ్యాంక్‌లోన్, రోడ్లు, డ్రైన్స్, ప్రహరీ రక్షణలో CRDA - లేఅవుట్‌లో గజం 10,000 -13,000 వరకు Ph: 95052 71297 (నో బ్రోకర్స్)
AJB -194971

మా చిత్రంలో నటించే అవకాశం
★ శ్రీ వెంకట లక్ష్మీనరసింహ ప్రొడక్షన్స్‌లో బాలా బాయసపాటి చిత్రం సెప్టెంబర్ 19న రామానాయుడు స్టూడియోలో షూటింగ్ ప్రారంభం. అన్ని వయసుల కొత్త వారికి యాక్టింగ్ ఫ్రీగా నేర్పిస్తున్నాం. మా సినిమాలో అవకాశం ఇస్తాం. నూతన నటీనటులు కావాలి.మీ ఫోటోలు మా వాట్సప్ నెం.7981403355కు పంపండి. ఫిలింనగర్ Hyd. పసుపులేటి శ్రీనివాస్ డైరెక్టర్.
AJH-002567

PLOT FOR SALE
★ హైదరాబాద్ హయత్‌నగర్, కుంట్లూరు, పసుమాముల, గౌరెల్లి, తారమతి పేట్, పెద్ద అంబర్ పేట, అబ్దుల్లాపూర్, పోచంపల్లి శ్రీమిత్ర, కోహెడల్లో ప్లాట్లు కొనబడును. సెల్:9391125860/ 9866288866
AJH-002431

PLOT FOR SALE
APCRDA అప్రూవ్డ్ ప్లాట్స్ ORR- రింగురోడ్డు అనుకొని అమరావతి రాజధానికి, ఐకానిక్ బ్రిడ్జి దగ్గరలో గేటెడ్ కమ్యూనిటీ నందు కలవు. బ్యాంక్ లోన్. సంప్ర॥ 9014437611, 7730099126.
AJG-9523

వధువు కావలెను
★ కుల పట్టింపు లేదు / 35 సం. / ఏకైక కుమారుడు / MBA / ప్రైవేట్ ఉద్యోగం / ఎత్తు 5.5 / అందమైన అబ్బాయికి 1వ & 2వ వధువు కావలెను. (పిల్లలు ఉన్నా OK) Direct - 9298450641
AJH-15792

FINANCE
గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌క (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668
AJD:186729

తనఖా FINANCE
రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం సిటీ పరిధిలో ఉన్న ఇళ్ళు, స్థలములపై తనఖా ఫైనాన్స్ చేయబడును. సిబిల్ చూడబడదు. Cell: 9666547338
AJD:186728

FINANCE
గవర్నమెంట్ ఉద్యోగస్థులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా పద్ధతిలో ఫైనాన్స్ చేయబడును. సిబిల్ చూడబడదు. Govt. Reg.No.136/2009. Cell: 9666547338
AJD:186727

WANTED
భీమవరం లోగల ఒక ప్రముఖ Radiance, Aesthetic's నందు పనిచేయుటకు ట్రైన్డ్ బ్యూటీషిన్స్ (ఆడ) కావలెను. సంప్రదించండి: 9885394144
AJN:000000

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా చెల్లించవలసిన క్లెయిమ్స్‌కు, దర్య వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటి

అంబేడ్కర్ రాజ్యాంగ రచనలు ప్రగతికి మార్గదర్శకాలు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు

భీమవరంటౌన్, ఆగస్టు 10 : డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగ రచనలు దేశ ప్రగతికి మార్గదర్శకాలుగా నిలుస్తాయని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 76వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. భీమవరం బార్ అసోసియేషన్ సభ్యులు పినికి శ్రీనివాస్‌రావు, కందికట్ల నాగరాజు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉండపల్లి నాయుడు, నరహరిశెట్టి కృష్ణ మాట్లాడుతూ అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం నెలకొల్పినట్టే ప్రకాశం చౌక్ సెంటర్‌లో ప్రకాశం పంతులు విగ్రహాన్ని నెలకొల్పాలన్నారు. అనంతరం హాస్టల్ విద్యార్థులకు, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆయా కళాశాల, పాఠశాలల్లో రాజ్యాంగ రచనలు విలువలు అనే అంశంపై పోటీలను నిర్వహించారు. ప్రజా నాట్య మండలి సభ్యులు ఎస్‌కే చాన్‌బాషా, పి.అమూల్యారావు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలి



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

తణుకు, ఆగస్టు 10: ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల మూడు నెలల వేతన బకాయిలు, ఈ ఏడాది జనవరి నుంచి పీఎఫ్ బకాయిలు తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. శనివారం తణుకు జిల్లా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ వి.అరుణకు వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రి స్థాయికి అనుగుణంగా కార్మికులను పెంచాలన్నారు. యూనియన్ నాయకులు చింతాలు, చిన్నా, లక్ష్మణరావు, బేబి, వెంకట లక్ష్మి, ప్రసన్నకుమారి, లక్ష్మి, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి : సీఐ



దుకాణాల వద్ద పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

ఆకివీడు, ఆగస్టు 10 : పట్టణ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు వర్తకులు, ప్రజలు, ప్రయాణికులు సహకరించాలని సీఐ వి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం జాతీయ రహదారికి ఇరువైపులా దుకాణాల వస్తువులను తొలగించడంతో పాటు వాహనాలు నియంత్రించి మాట్లాడారు. ఎస్ఐ బత్తిన నాగబాబు, కానిస్టేబుల్ సూర్యనారాయణ ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి : కమిషనర్



వార్డుల్లో శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్, మేనేజర్

ఆకివీడు, ఆగస్టు 10 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే రోగాల బారిన పడతారని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ అన్నారు. పట్టణ పరిధిలోని పలు వార్డులలో శనివారం ఆయన శానిటేషన్ పనులు పరిశీలించి మాట్లాడారు .చెత్తను ప్రజలు డ్రెయిన్లలో వేయడంతో అది కుళ్ళి దుర్వాసనతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారన్నారు. నగర పంచాయతీ రిక్షాలు, ట్రాక్టర్లు వచ్చినప్పుడు చెత్తను వాటిలో వేయాలన్నారు. నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

పాలకోడేరు, ఆగస్టు 10:వర్షాకాలంలో జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య పరీక్షలు నిర్వహించాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు సీహెచ్‌వీ రంగనాయుడు సూచించారు. గొల్లలకోడేరులో ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశిబిరానికి వచ్చిన వారితో మాట్లాడారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీహెచ్‌వో సత్యనారాయణ, సూపర్‌వైజర్ శంకర్, వైద్యసిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

నేటి నుంచి బీజేపీ ప్రత్యేక కార్యక్రమాలు

పాలకొల్లు టౌన్, ఆగస్టు, 10 బీజేపీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఈనెల 11 నుంచి 14 వరకూ గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని బీజేపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రంశెట్టి పద్మారావు తెలిపారు. పాలకొల్లు పట్టణ బీజేపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా ప్రజలందరిలోనూ దేశభక్తిని పెంపొందించే దిశగా ఐదు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలు కాకినాడ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి రావూరి సుధ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కృష్ణా జిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్ధి, జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణు ఇంజనీరింగ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 10 : విద్యార్థులు ఉద్యోగాలపైనే దృష్టి పెట్టకుండా మంచి పారిశ్రామికవేత్తగా ఎదిగే ఉన్నత ఆలోచనలను కలిగి ఉండాలని శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ ఆర్.రవిచంద్రన్ అన్నారు. శ్రీవిష్ణు ఇంజనీరింగ్ కాలేజీ ఫర్ ఉమెన్ ఏడో గ్రాడ్యుయేషన్‌డే "విష్ణోత్సవ్ 2క24"ను శనివారం కళాశాల దక్షిణ క్యాంపస్‌లోని విష్ణు కన్వెన్షన్ సెంటర్‌లో వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, కళాశాల కార్యదర్శి ఆదిత్య విస్సమ్, స్టూడెంట్స్ అండ్ అడ్మిన్ డాక్టర్ పి. శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వెంకటరామరాజు, డీన్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పితానికి మంత్రి నిమ్మల పరామర్శ

పోడూరు, ఆగస్టు 10:కొమ్ముచిక్కాలలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు పెనుగొండ ఎస్‌వీకేపీ జూనియర్ కళాశాల చైర్మన్ పితాని సూర్యనారాయణ ఇటీవల మృతిచెందారు. శనివారం రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు కొమ్ముచిక్కాల వెళ్లి పితాని సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పాలకొల్లు పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల చాంబర్ మాజీ అధ్యక్షుడు పిల్లి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **భీమవరంటౌన్, ఆగస్టు 10 :** భీమవరం పట్టణంలోని 37వ వార్డు రజకపేటకు చెందిన పాలచి తాతారావు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండడంతో అతడికి వైద్య సదుపాయం నిమిత్తం ప్రశాంత్ టీమ్ హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా అందించారు.
- **యలమంచిలి :** ఊటాడకు చెందిన బుడితి శ్రీనివాస్ ఉపాధికోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ ప్రమాదానికి గురై స్వగ్రామానికి తిరిగివచ్చి ప్రమాదంలో వెన్నుముక దెబ్బతినడంతో వైద్య చికిత్స నిమిత్తం పాలకొల్లు వాకర్స్ క్లబ్ కార్యవర్గం తరపున సంస్థ అధ్యక్షుడు తటపర్తి సుధాకరరావు చేతులమీదుగా రూ.15 వేల మందులను బాధితునికి శనివారం అందజేశారు.
- **ఆచంట :** ఇటీవల భీమలాపురానికి చెందిన యాళ్ళ రాజు విద్యుత్ లైన్‌మెన్ కరెంట్ షాక్‌కు గురై మృతి చెందడంతో శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సంతాప సభలో చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎట్టకేలకు పైప్‌లైన్ పనులు ప్రారంభం

- ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు యత్నం
- 19 ఏళ్ల క్రితం పైపులైను నిర్మాణం
- పదేళ్ల క్రితం ట్రయల్ రన్
- మరమ్మతులకు టెండర్లు పిలిచినా ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు
- ఎమ్మెల్యే రఘురామ చొరవతో పనులు ముందుకు



చినకాపవరం వద్ద సంపు, మోటార్లు పరిశీలించిన ఎస్ఈ తదితరులు.. (ఇన్‌సెట్‌లో) పరిమెళ్ల వద్ద పైపులైన్ ప్రారంభించిన ఎమ్మెల్యే రఘురామ (ఫైల్)

ఆకివీడురూరల్ ఆగస్టు 5 : సుమారు పంతొమ్మిదేళ్ల క్రితం ఆకివీడు, కాళ్ళ మండలాల్లోని 50గ్రామాల ప్రజలకు తాగునీరు అందించేందుకు నిర్మాణం చేపట్టిన పైప్‌లైన్ పనులు పాలకులు, ప్రభుత్వాల నిరక్ష్యంతో నిలిచిపోయాయి. ఎట్టకేలకు ఆ పనులను ఇటీవల ఉండి ఎమ్మెల్యేగా గెలుపొందిన రఘురామకృష్ణరాజు చొరవతో ముందుకు సాగుతున్నాయి. వెంకయ్యవయ్యేరు కాలువ శివారు ప్రాంతాలైన ఆకివీడు, కాళ్ళ మండలాల్లోని 50 గ్రామాల ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు 19 ఏళ్ల క్రితం ప్రారంభించిన పైపులైను పనులు పాలకుల నిర్లక్ష్యంతో విఫలమైంది. 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ చేతుల మీదుగా పైపులైనుకు శంకుస్థాపన జరిగి నిధులు కేటాయించినప్పటికీ పనులు నత్తనడకన జరిగాయి. పైపులైను నిర్మాణానికి ప్రణాళిక లేక కాల్వగట్ల వెంబడి చేపట్టడంతో గట్లు అండలు జారి పైపులైను కాల్వలోకి జారిపోయాయి. 2015లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పైపులైను మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టారు. అయినప్పటికి చినకాపవరం నీరు చేరుకోలేదు. 2019 ఎన్నికల ముందు జగన్ పాదయాత్రలో ఈపైపులైను నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించినప్పటికి హామీని నిలబెటుకోలేదు. ఈ పైపులైనుపై ప్రస్తుత ఎమ్మెల్యే, అప్పటి ఎంపీ రఘురామకృష్ణరాజు దృష్టిలో పడినప్పటికీ జగన్ ప్రభుత్వం ఆ పనులను అడ్డుకుని ముందుకు సాగనివ్వలేదు. ఏళ్ల తరబడి ఉపయోగంలోకి రాకపోవడంతో మోటార్లు, ఎలక్ట్రికల్ బోర్డులు, పైపులైను పాడైపోయి.. మోటార్లు మొరాయించాయి. ప్రతి ఏటా జిల్లా పరిషత్ నిధులు కేటాయించి, టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

ఎమ్మెల్యే చొరవతోనే పనులు ప్రారంభం : ధనానంద్, డీఈ

పైపులైను మరమ్మతుల కోసం కాంట్రాక్టర్లు ఆసక్తి చూపించకపోవడంతో ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు పైపులైన్‌పై దృష్టి సారించారు. కలెక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించి జూలై 31న పరిమెళ్ళలో ట్రయల్ రన్‌ను ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజుతో కలిసి ప్రారంభించారు. పైపులైను ద్వారా గణపవరం వరకు నీరు చేరింది. గణపవరం, చినకాపవరంలలో ఐరన్ పైపులలో పగుళ్ళు వచ్చి పాడైన స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందిస్తారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



మేడపాడులో స్వర్ణోత్సవ స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కాళ్ళ, ఆగస్టు 10 : వేంపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ నాయకులు బీఆర్ఎంకే స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ నేతలు కవులూరి సత్యనారాయణ, పొదిల శ్రీరామకృష్ణ చేతుల మీదుగా పతాకా ఆవిష్కరణ చేసి గేయాన్ని ఆలపించారు. సీనియర్ నేతలు శ్రీనివాసరాజు, పట్టాభిరామయ్య మాట్లాడారు. అనంతరం రామకృష్ణ, సత్యనారాయణలను సత్కరించారు. శంకర్, రాజ్యలక్ష్మీ, కనకదుర్గ, మణి, అశోక్, రవికుమార్, అప్పలాచార్యులు, వర్మ పాల్గొన్నారు.

- ఆకివీడు :ఆకివీడు యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కోశాధికారి పట్టాభి ఆధ్వర్యంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. యూటీఎఫ్ సంఘం హక్కులు, బాధ్యతలు కల్గి ఉండడమే కాకుండా అధ్యయనం చేస్తుందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ కార్యవర్గ సభ్యులు జిల్లా సత్యనారాయణ, రాజు, సీపీఎం సీనియర్ సభ్యు లు షేక్ వలీ తదితరులు ఉన్నారు.
- గణపవరం: యూటీఎఫ్ 50 వసంతాల వేడుకలు గణపవరంలో బాలికల హైస్కూల్ ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ పతాకాన్ని జిల్లా మాజీ కార్యదర్శి హెచ్ఎస్‌బీవీ ఆంజనేయులు ఎగురవేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. యూటీఎఫ్ మండల నేతలు శర్మ, భవానిప్రసాద్, రమేష్, నరసింహరావు, లక్ష్మణరాజు తదితరులు పాల్గొన్నారు.
- మొగల్తూరు : మొగల్తూరు యూటీఎఫ్ కార్యాలయంలో విశ్రాంత ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించారు. యూటీఎఫ్ సీనియర్ ఉపాధ్యాయులు పొదిల కృష్ణమూర్తి, చింతపల్లి ఆంజనేయులు, ఆలీవలి, ఉపాధ్యాయులు సీహెచ్ కృష్ణమోహన్, ఎన్ బుజ్జిబాబు పాల్గొన్నారు.
- యలమంచిలి : మండలంలోని మేడపాడులో యూటీఎఫ్ స్వర్ణోత్సవ స్తూపం, లోగో, పతాకావిష్కరణలను రాష్ట్ర మాజీ కార్యదర్శి సరిపల్లి జయప్రభ, దేవ సుధాకర్, పోలిశెట్టి గోపాలకృష్ణగోఖలే ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోఖలే మాట్లాడుతూ హక్కులు, బాధ్యతలు రెండు కళ్లుగా, అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా పనిచేయడం యూటీఎఫ్‌కే సాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపిమూర్తి, జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.విజయరామరాజు, దండు పద్మావతి, అడ్డాల వాసుదేవరావు, డేగల సత్యసూర్యప్రభ, వీరాజీ, గుత్తిందీవి శ్రీనివాసరావు, పంతం రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు మొక్కుతీర్చుకున్న పవన్ అభిమానులు



మొక్కుతీర్చుకున్న జనసైనికులతో చంద్రశేఖర్

భీమవరం టౌన్,ఆగస్టు 10 :పిఠాపురంలో పవన్ గెలుపు కోసం పాలకొల్లు నియోజకవర్గం నార్నిమెరకు చెందిన జనసేన నాయకులు ఏడిద కృష్ణమూర్తి శనివారం రాత్రి మావుళ్ళమ్మ ఆలయం వద్ద అమ్మవారికి 1,116 కొబ్బరికాయలు కొట్టి మొక్కుతీర్చుకున్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల చంద్రశేఖర్ పాల్గొని నాయకులను, కార్యకర్తలను అభినందించారు. తొలుత అమ్మవారి దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. ఆలయం ఆరుబయట అమ్మవారి చిత్రపటం వద్ద కాయలు కొట్టి మొక్కుతీర్చుకున్నారు.

రహదారుల టోల్ ట్యాక్స్ విరమించుకోవాలి

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 10 :రాష్ట్ర రహదారులపై టోల్ ట్యాక్స్ విధించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారామ్ డిమాండ్ చేశారు. స్థానిక భీమవరం రోడ్డులో శనివారం సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇప్పటికే కేంద్రం విధించిన ట్యాక్స్‌లతో వాహనదారుల నడ్డి విరుగుతోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం మరింత పన్ను విధించడం తగదని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్, పీవీ ప్రతాప్, కవురు పెద్దిరాజు, కర్రి నాగేశ్వరరావు, పాలకొల్లు కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, చల్లా సోమేశ్వరరావు, అజయ్ కుమార్, సత్యనారాయణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మానవత కన్వీనర్ మోహన్‌రావుకు అవార్డు



అవార్డు అందజేస్తున్న రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర

పెంటపాడు, ఆగస్టు 10: పెంటపాడుకు చెందిన జిల్లా మానవత విద్యా కమిటీ కన్వీనర్ తాడేపల్లి మోహన్‌రావు జాతీయ అవార్డును అందుకున్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డును రాజ మండ్రిలో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర చేతుల మీదుగా అందుకున్నారు. గతంలో ఆంధ్రాబ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేసిన ఈయన అనంతరం మానవత స్వచ్ఛంద సేవా సంస్థలో చేరారు. ఎంతో మందికి సాయం చేశారు. దీంతో ఈయనను ఈ అవార్డు వరించింది.

నేడు - రేపు సమాచారం

- **పెంటపాడు, ఆగస్టు 10:** కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవాన్ని ఆదివారం ఏపీ నిట్ ప్రాంగణంలో టీబీఆర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు టీబీఆర్ చైర్మన్ తనుబుద్ధి భోగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పరమవీరచక్ర అవార్డు గ్రహీత సుబేదార్ మేజర్ సంజయ్‌కుమార్‌తో పాటు పలువురు సైనిక వీరుల్ని సత్కరిస్తామని తెలిపారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు హాజరవుతారన్నారు.
- **తణుకు :** సమాజంలో సమస్యల పరిష్కారం కోసం తమ సంస్థ పనిచేస్తుందని జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం జాతీయ సలహా సభ్యుడు తమరాపు సత్యనారాయణ అన్నారు. శనివారం తణుకులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం తణుకు బాల గంగాధర్ తిలక్ ఆడిటోరియంలో ఆర్టీఐ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు.
- **మొగల్తూరు :** మొగల్తూరు మండల గ్రామీణ వైద్యుల సంఘం ఏర్పడి 25వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా ఆదివారం ముత్యాలపల్లిలో గ్రామీణ వైద్యులు (పిఎంపి)ల సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం తెలిపింది. ముత్యాలపల్లి రాజాస్ కల్యాణ మండపంలో నిర్వహించే సమావేశానికి వైద్యులు ముఖ్య అతిథిగా రానున్నారని నిర్వాహకులు కోరారు.
- **పాలకొల్లు అర్బన్ :** ప్రముఖ సోషలిస్టు నాయకుడు, కళాకారుడు జాన నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆదివారం ఉదయం లాకుల సెంటర్‌లో రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆవిష్కరించనున్నారు. జాన నాగేశ్వరరావు నాటక రంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేయడంతో పాటు పేద పేదల తరపున అనేక మార్లు ప్రభుత్వంపై పోరాటాలు చేశారు.
- ఆచంట : స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద అన్ని గ్రామాల సర్పంచ్‌లు , కార్యదర్శులకు ఈనెల 12,13,14 తేదీల్లో మూడు రోజుల పాటు గ్రామాల్లో పారిశుధ్య పనులు పరిపాలనా విధానంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నరసింహ ప్రసాద్ తెలిపారు. శిక్షణ తరగతులకు సర్పంచ్‌లు, కార్యదర్శులు విధిగా హాజరు కావాలని కోరారు.

డ్వాక్రా మహిళల సొమ్ము దోచుకున్న ఘనత జగన్‌దే



విలేకర్లతో మాట్లాడుతున్న గుడాల సునీత

నరసాపురం టౌన్, ఆగస్టు 10 : సీఎం చంద్రబాబుని విమర్శించే అర్హత మాజీ సీఎం, ఎమ్మెల్యే జగన్‌కు లేదని టీడీపీ డ్వాక్రా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గుడాల సునీత అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను పెట్టి మహిళలకు ఆర్థిక చేయూతను అందించిన ఘనత చంద్రబాబుది అయితే, డ్వాక్రా నిధుల్ని దోచుకున్న ఘనత ఎమ్మెల్యే జగన్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, ఇప్పుడు చంద్రబాబును విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. తిరుమాని శశిదేవి, పాల దుర్గాభవాని, బొమ్మి రాజేశరి, చెల్లుబోయిన కనకదుర్గ, మంగ తాయారు, బస్వాని నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సెంటర్‌లో రాస్తారోకో

నరసాపురం టౌన్, ఆగస్టు 10 : విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆకతాయిలు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో వైసీపీ నాయకులు రాస్తారోకో చేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. వైసీపీ జిల్లా నాయకులు జాన్ కెనడీ మాట్లాడుతూ ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఛైర్‌పర్సన్ వెంకటరమణ, ఎంపీపీ సోని, పీడీ రాజు, పప్పుల రామారావు, బుల్లి మస్తాన్, కామన బుజ్జి, కాకిలేటి ఆనంద్, బర్రె జయరాజు, దొంగ మురళీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు కృషి

పెనుగొండ, ఆగస్టు 10 :ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామని సర్పంచ్ నక్కా శ్యామలా సోనిశాస్త్రి అన్నారు. శనివారం పెనుగొండలోని దొంగరావిపాలెంలో దోమల నివారణ చర్యల్లో భాగంగా మలాథియన్ మందు స్ప్రే చేయించారు. కార్యదర్శి టి.రత్నాకర్‌రావు, భీమడోలు సాయి, తిక్కిరెడ్డి కార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహేష్‌బాబు పుట్టినరోజు వేడుకలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 10 :సినీ హీరో మహేశ్‌బాబు పుట్టిన రోజు వేడుకలను అభిమాన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షుడు మేడికొండ శ్రీనివాసరావుచౌదరి పర్యవేక్షణ లో మారుతీ థియేటర్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో పట్టణ సీఐ కె. రజనీకుమార్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌ను అందరికీ పంపిణీ చేశరు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేసి మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మికం

వాసవీ మాత ఆలయానికి సహకారం అందిస్తా

- మంత్రి నిమ్మల రామానాయుడు



పాలకొల్లులో వాసవీ మాత ఆలయ నిర్మాణ శంకుస్థాపనలో మంత్రి నిమ్మల పూజలు

పాలకొల్లు టౌన్, ఆగస్టు 10 : వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం పాలకొల్లులో శ్రీగామాస్ వాసవి క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో జరిగిన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని అమ్మవారి చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ నిర్వాహకులు పాల్గొన్నారు.

- అత్తిలి : ఈడూరు వరాల వేంకటేశ్వరస్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, విశేష అర్చనలు జరిపారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేసింది.
- ఆచంట : కొడమంచిలి వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆధ్యాత్మిక గురువు మానేపల్లి ఉమారామలింగేశ్వర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.
- మొగల్తూరు : మొగల్తూరులోని కేతకి పురసామ్రాజ్య భూసమేత కలియుగ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గంగ పవన్ ఆధ్వర్యంలో స్వామిని పలు పుష్పాలతో సుందరంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గోతులను పూడ్చండి : ఎమ్మెల్యే బొలిశెట్టి



తాడేపల్లిగూడెంలో గోతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 10: రహదారులపై గోతులను తక్షణం పూడ్చాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. తాడేపల్లిగూడెం నుంచి తణుకు, ప్రత్తిపాడు, అలంపురం వెళ్ళే రహదారులను శనివారం ఆయన పరిశీలించారు. రహదారుల అభివృద్ధికి ఇప్పటికే టెండర్ల దశకు చేరుకున్నా వర్షాల కారణంగా ఇంకా నిర్మాణ దశకు చేరుకోలేదన్నారు. ఆర్అండ్‌బీతో పాటు అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలి : అంజిబాబు

భీమవరంటౌన్, ఆగస్టు 10 : రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. శనివారం భీమవరం 32 డెంటల్ కేర్ హాస్పటల్ వద్ద హోప్ చారిటబుల్ ట్రస్ట్ ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా బాధితులకు రక్తదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మీ రక్తదానం 45మంది తలసేమియా చిన్నారులలో ఒకరికి ప్రాణ దానం అవుతుందన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఈ వ్యాధిగ్రస్తులకు వైద్యం, రక్తదానం చేయడానికి నావంతు కృషి చేస్తానన్నారు. హోప్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ అల్లాడి రవితేజ మాట్లాడుతూ తలసేమియా బాధితులకు రక్తదానం చేయాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ, పొత్తూరి బాపిరాజు, సభ్యులు పాల్గొన్నారు.

వాండ్రం రైల్వే గేటు సమస్య పరిష్కరిస్తా : రఘురామ



ఎమ్మెల్యేను కలిసిన చెరుకువాడగరువు వాసులు

ఉండి/కాళ్ల, ఆగస్టు 10 : వాండ్రం రైల్వేగేటు సమస్యను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. శనివారం వాండ్రం విచ్చేసిన ఆయనకు చెరుకువాడ గరువుకు చెందిన సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, మాజీ సర్పంచ్‌లు రెడ్డిపల్లి సత్యనారాయణ, యాడంగి యేసు, మాజీ ఉపసర్పంచ్ చిలకాపుల సత్యనారాయణ తదితరులు కలిసి వాండ్రం రైల్వేగేటు పగలు తెరిచి వుంటుందని సాయంత్రం ఆరు గంటలు అయితే మూసివేస్తున్నారంటూ వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాండ్రం రైల్వేగేటు నుంచి పెదఅమిరం రైల్వే గేటు వరకు రోడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలని అధికారులకు సూచించారు. అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

- తాము 70 ఏళ్ల నుంచి చెరుకువాడ గరువు ప్రాంతంలో నివాసం వుంటున్నామని ఎన్‌హెచ్ 165 విస్తరణలో భాగంగా తమ ఇళ్లు దాటి మార్కింగ్ వేశారని తమకు ప్రత్యామ్నాయం, నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు భీమవరంలో శనివారం మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే బాధితులకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందిస్తానని తెలిపారు.

చిన్నారి రఘురామతో ఎమ్మెల్యే ముచ్చట్లు

కుమారుడు పుడితే సాధారణంగా తండ్రి, తాత, లేక దేవుడి పేరు పెట్టుకుంటారు. కానీ గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన మంతెన రవీంద్రరాజు తన కొడుకుకి పదకొండేళ్ల క్రితమే రఘురామకృష్ణరాజు పేరు పెట్టి ఆయన మీద అభిమానాన్ని చాటుకున్నారు. శనివారం కాళ్ల మండలం పెదఅమిరంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద కొడుకును తీసుకువచ్చి ఎమ్మెల్యేకు పరిచయం చేశారు. ఎమ్మెల్యే రఘురామ ఆ బాలుడిని నీ పేరు ఏమిటి..? అని అడగ్గా.. నా పేరు రఘురామకృష్ణరాజు అని చెప్పడంతో సంతోషం వ్యక్తం చేస్తూ కొంచెం సేపు ముచ్చటించారు.



ఎమ్మెల్యేకు సత్కారం.. శిబిరంలో మందులు అందజేస్తున్న బాబ్జి

ఆదివాసీలకు అండగా కూటమి ప్రభుత్వం : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్/తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 10: ఆదివాసీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఏపీ ఎస్సీ, ఎస్టీ గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సింగం సుబ్బారావు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం బీవీఆర్ కళా కేంద్రంలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆదివాసీల కళలను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కొండారెడ్డి నరహరి, దెందులూరు జనసేన ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, గిరిజన రత్న సింగం పట్టాభి, సింగం సత్యనారాయణ, నరిసే సోమేష్ తదితరులు మాట్లాడారు. పట్టణంలోని ఎల్‌ఎల్ఎం విమోచనా మందిరంలో పాస్టర్ జైబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, గొర్రెల శ్రీధర్, వర్తనపల్లి కాశి, నరిసే సోమేశ్వరరావు, చాపల రమేష్, ముప్పిడి రమేష్ పాల్గొన్నారు.

- ఆపదలో ఉన్న వారిని ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆత్మబంధువు సేవా సంఘం ఆధ్వర్యంలో వేలేరుపాడు వరద బాధితుల సహాయార్థం సేకరించిన వస్తువుల వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఆత్మబంధువు సంఘం సేవలను కొనియాడారు. సంఘ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్కూల్లో డిజిటల్ తరగతుల ఏర్పాటు అభినందనీయం



డిజిటల్ క్లాస్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయకర్, రామరాజు, మాజీ మంత్రి కొత్తపల్లి తదితరులు

మొగల్తూరు, ఆగస్టు 10 : ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులు నిర్వహణకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం పేరుపాలెం సౌత్ పంచాయతీ చల్లావారిమెరక యూపీ స్కూల్‌లో నోర్డ్ ఆంగ్లేయ ఎడ్యుకేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.11లక్షల 61వేలతో నిర్మించిన డీజీ తరగతి భవనం, క్లాస్ రూమ్‌లను మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజులతో కలిసి ఆయన ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి చల్లా బెనర్జీ నోర్డ్ ఇండియా సంస్థలో ఉన్నత స్థితిలో ఉద్యోగం చేస్తూ తాను పని చేస్తున్న కంపెనీ ప్రతినిధులను సంప్రదించి నిధులు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా స్కూలు స్థల దాతలను గ్రామస్థులు సన్మానించారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి చిన్నా, గుబ్బల నాగరాజు, కొల్లాటి గోపి, మేళం బన్ను, తదితరులు పాల్గొన్నారు.

గోవుల తరలింపు అడ్డగింత

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 10: గోవులను వధించేందుకు తరలిస్తున్న వ్యాన్‌ను తాడేపల్లిగూడెం ధర్మసంస్థాన్ సభ్యులు శనివారం అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండలంలోని నీలా ద్రిపురం నుంచి వీటిని తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో వ్యాన్‌ను అడ్డుకు న్నారు. గోవులను రైతులకు అందిస్తామన్న ఒప్పందంతో సభ్యులు శాంతించారు.

బహిరంగ ప్రకటన

[illegible]

SCHEDULE

Registered Partition deed dated 05-04-2024 Document No.940/2024

West Godavari District, Tadepalligudem Registration Sub District, Tadepalligudem Municipality, old 10th ward, present election ward No.14th block, Puritha Road area, old D.No.4-171-22 new D.No.4-170-2/2, R.S.No.154/1 in that southern side Ac.1.44, old Assessment No.15693, new Assessment No.108080 2059.Previously existed thatched house present vacant site an extent of 166 sq.ys in that northern side 84.75 sq.yds of site is bounded by

East : site of pathan karim 15 feet

South: A Schedule property site 50.85 feet

West : 24 Feet width road 15 feet

North : Site of Yelesetti Venkata Ramanchan 50.85 feet with in the above boundaries 84.75 sq.yds with all easement rights there on.

తాడేపల్లిగూడెం 07.08.2024

[illegible]